భారత్, జపాన్ మధ్య సాంస్కృతిక మార్పిడికి కృషి

సంగారెడ్డి ఫిబ్రవరి22(నమస్తే తెలంగాణ) : భారత్, జపాన్ మధ్య దౌత్య సంబంధాలు మెరుగుపర్చడంతోపాటు సాంస్కృతిక మార్పిడికి జైకా(జపాన్ ఇంటర్నేషనల్ కోఆపరేటివ్ ఏజెన్సీ) కృషి చేయనున్నట్లు జైకా భారతదేశ ప్రతినిధి సైటో తెలిపారు. సంగారెడ్డి జిల్లా కందిలోని ఐఐటీ హైదరాబాద్‌లో జైకా, ఐఐటీహెచ్ సంయుక్తంగా 'డిజైన్ ఇన్నోవేషన్' పేరుతో ప్రముఖ ఆర్కిటెక్టులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో జపాన్, భారతదేశానికి చెందిన 200 మంది ఆర్కిటెక్టులు, ఐఐటీ హైదరాబాద్‌లోని డిపార్టుమెంట్ ఆఫ్ డిజైన్ విభాగం ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు. సమావేశంలో జైకా భారతదేశ ప్రతినిధ సైటో మాట్లాడుతూ ఐఐటీ హైదరాబాద్‌తో కలిసి పనిచేయటం తమకు ఎంతో ఆనందంగా ఉన్నదన్నారు. ఐఐటీ హైదరాబాద్ క్యాంపస్ నిర్మాణానికి జైకా ఆర్థికసాయం అందజేసినట్లు గుర్తుచేశారు. ఐఐటీ హైదరాబాద్ నుంచి డిజైనింగ్ విభాగంలో ఉత్తమ ఇంజినీర్లు, ఆర్కిటెక్టులు వచ్చేందుకు సహకరిస్తామని తెలిపారు. ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ బీఎస్‌మూర్తి మాట్లాడుతూ భారత్, జపాన్ మధ్య బలమైన దౌత్యసంబంధాలు ఏర్పడేందుకు ఐఐటీ హైదరాబాద్, జైకా వారధిగా పనిచేస్తున్నట్లు చెప్పారు. డిజైనింగ్ రంగంలో ఉత్తమ ఆవిష్కరణల కోసం 200మంది ఆర్కిటెక్టులతో నిర్వహించిన సమావేశం ఎంతో దోహదం చేస్తుందన్నారు. సమావేశంలో టోక్యో విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డా.హిడెతో షి, జోసాయ్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డా. యోజోపుజినో, టోక్యో విశ్వవిద్యాలయం అసోసియేట్ ప్రొఫెసర్ డా.యోషియుకి కవాజో 'డిజైనింగ్ ఇన్నోవేషన్'పై ప్రసంగించారు.

సమావేశంలో పాల్గొన్న ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ బీఎస్ మూర్తి, జైకా భారతదేశ ప్రతినిధి సైటో

కార్యకర్త కుటుంబానికి బీమా చెక్కు అందజేత

కల్హేర్, ఫిబ్రవరి 22: బీఆర్ఎస్ సభ్యత్వం ఉండి ప్రమాదవశత్తు మరణిస్తే బాధిత కుటుంబానికి పార్టీ ఆర్థిక చేయూతనందిస్తున్నదని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని మెట్టుకుంట తండాకు చెందిన విఠల్‌నాయక్ ప్రమాదవశత్తు మృతి చెందడంతో పార్టీ సభ్యత్వ బీమా కింద మంజూరైన రూ.2లక్షల మంజూరైన చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం అహర్నిశలు శ్రమించే కార్యకర్తలను కాపాడుకోవడానికి కేసీఆర్ పార్టీ సభ్యత్వం కింద బీమా సౌకర్యం కల్పించారన్నారు. బీమా పథకం ఏ పార్టీలో లేదని, చాలామంది కార్యకర్తల కుటుంబాకు బీఆర్ఎస్ అండగా నిలుస్తున్నదన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ నర్సింహారెడ్డి, జిల్లా కోఆప్షన్ సభ్యుడు అలీ, నాయకులు అంజయ్యసాగర్, శ్రీనివాస్‌గౌడ్, మోహన్‌సాగర్ ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

సిర్గాపూర్, ఫిబ్రవరి 22: సిర్గాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త శరత్‌కుమార్ మృతి చెందడంతో నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతికి గల కారణాలు తెలుసుకొని ఓదార్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దేవేందర్, నాయకులు శివాజీరావు, విఠల్‌రావు, ప్రకాష్‌రావు, రమేశ్, బాలాజీ, ఫిరాజుద్దీన్, అంబాదాస్ ఉన్నారు.

బాధితురాలికి చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

రహదారిపై మట్టి తొలిగింపు

కంది, ఫిబ్రవరి 22: కంది జాతీయ రహదారిపై పేరుకుపోయిన మట్టిని గురువారం పంచాయతీ కార్మికులు తొలిగించారు. కంది గ్రామ పంచాయతీ కార్యదర్శి విద్యాధర్‌గౌడ్ సమక్షంలో కార్మికులు డివైడర్ పక్కన ఉన్న మట్టిని ఒక్కదగ్గరకు చేర్చి ట్రాక్టర్లో తరలించారు. డివైడర్ మధ్యలో ఉన్న పిచ్చి మొక్కలు, గడ్డిని తీసివేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి విద్యాధర్‌గౌడ్ మాట్లాడుతూ వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా జాతీయ రహదారిపై పేరుకుపోయిన ఇసుక, మట్టిని శుభ్రం చేయించినట్లు తెలిపారు. రహదారిపై పేరుకుపోయిన ఇసుకతో ప్రమాదాలు జరుగుతున్నందున బాలాజీ దవాఖాన నుంచి కంది చౌరస్తా వరకు రహదారిని శుభ్రం చేయడంతోపాటు ట్యాంకర్‌తో నీటిని చల్లించినట్లు చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది మల్లేశం, కార్మికులు పాల్గొన్నారు.

జహీరాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా సాయిచరణ్

జహీరాబాద్, ఫిబ్రవరి 22: జహీరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన కార్యకవర్గాన్ని నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. మార్కెట్ కమిటీ చైర్మన్‌గా అగమ సాయి చరణ్, వైస్ చైర్మన్‌గా తిరుపతిరెడ్డిని నియమించారు. సభ్యులుగా నరేశ్‌గౌడ్, కిషన్‌రాథోడ్, వంశీరాజు, సుజాత, జాఫర్, శేఖర్, అశోక్, అఖీల్ ఆహ్మద్, సయ్యద్ మజీద్ మిరియా, మల్లారెడ్డి, నర్సిములు, శంకరప్ప పటేల్, న్యాలకల్ పీఏసీఎస్ చైర్మన్ సంగారెడ్డి, జహీరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ అధికారులను, జహీరాబాద్ మున్సిపల్ చైర్మన్, ప్రత్యేక అధికారిని సభ్యులుగా నియమించారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠ

జిన్నారం, ఫిబ్రవరి 22: మండలంలోని లక్ష్మీపతిగూడెంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో భక్తిశ్రద్ధలతో ప్రసన్నాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన గురువారం వైభవంగా జరిగింది. వేద పండితుల ఆధ్వర్యంలో ఉదయం జరిగిన ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి జడ్పీవైస్ చైర్మన్ ప్రభాకర్, ఎంపీపీ రవీందర్‌గౌడ్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు గూడెం మధుసూదన్‌రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్‌గౌడ్, గ్రామస్తులతో కలిసి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గూడెం మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో చేపడుతున్న నూతన ఆలయాల నిర్మాణాలకు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సంపూర్ణ సహకారం అందిస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ఆలయాలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తున్నదన్నారు. కార్యక్రమంలో గడ్డపోతారం ఎంపీటీసీ జనాబాయి, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, మాజీ సర్పంచ్‌లు లావణ్యాజీపన్, శెట్టి శివరాజ్, జనార్దన్, ఆంజనేయులు, శ్రీకాంత్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ వీరారెడ్డి, నరేందర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు భవాని రమేశ్, కుమ్మరి కృష్ణ, సార శ్రీనివాస్, ఆంజనేయులు, బాబు, నాయకులు సార నరేందర్ పాల్గొన్నారు.


విగ్రహ ప్రతిష్ఠాపనలో జడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్, గూడెం మధుసూదన్‌రెడ్డి

29 నుంచి వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

బొల్లారం, ఫిబ్రవరి 22: బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని బాలాజీనగర్ వేంకటేశ్వర స్వామి 17వ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు ఈ నెల 29 నుంచి మార్చి 2వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు, మున్సిపల్ పెద్దలు తెలిపారు. 29న బ్రహ్మోత్సవాలు ప్రారంభం, మార్చి 1న శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం, సాయంత్రం ఊరేగింపు సేవ, 2న స్వామి వారి వసంతోత్సవం, సహస్ర దీపాలంకరణ సేవ, విశేష పూజ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు జరుగే మూడు రోజుల పాటు భక్తులకు రోజూ అన్నదాన కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఉత్సవాల నేపథ్యంలో ఎవరైనా దాతలు, భక్తులు సహాయసహకారాలను అందించవచ్చని తెలిపారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

అధికారులతో కలెక్టర్ వల్లూరు క్రాంతి సమీక్ష

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, ఫిబ్రవరి 22: పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు పటిష్ట చర్యలు చేపట్టాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో పదో తరగతి, ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలు మర్చి 18 నుంచి ఏప్రిల్ 2 వరకు ఉదయం 9:30గంటల నుంచి ఉంటాయన్నారు. దీనికి సంబంధించి జిల్లాలో ఏర్పాటు చేసిన 121పరీక్ష కేంద్రాల్లో 22,045 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారని తెలిపారు. ఫిబ్రవరి 28 నుంచి మార్చి 19 వరకు ఇంటర్ పరీక్షలు జరుగుతాయని, ఒక నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రంలోకి అనుమతి లేదని స్పష్టం చేశారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పరీక్షలు జరుగుతాయని, ఇందుకోసం మొత్తం 52 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలకు మొత్తం 17, 665మంది విద్యార్థులు హాజరు కానుండగా, ఇందులో 15,984మంది జనరల్ కేటగిరీ, 1681 మంది వొకేషనల్ కేటగిరీ విద్యార్థులు ఉన్నారని వివరించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలకు మొత్తం 18, 488 మంది విద్యార్థులు హాజరు కానుండగా, ఇందులో 17,057మంది జనరల్ కేటగిరీ, 1431 మంది వొకేషనల్ కేటగిరీ విద్యార్థులు ఉన్నారని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144సెక్షన్ విధించాలని, కేంద్రాల సమీపంలోని అన్ని జీరాక్స్ కేంద్రాలు మూసివేయాలన్నారు. పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు జాగ్రత్తలు పాటించాలని వివరించారు. పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌కు అవకాశం ఇవ్వవద్దని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, అదనపు ఎస్పీ సంజీవరావు, డీఈవో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సమస్యాత్మక కేంద్రాలను గుర్తించాలి

జిల్లాలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి సంబంధిత ఎన్నికల అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో మెదక్, జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించిన సెక్టార్ అధికారులు, పీఓలకు, ఏపీఓ ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిస్టికల్ సర్వేలెన్స్, వీడియో సర్వేలెన్స్, వీడియో వ్యూయింగ్ బృందాలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలకు ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలన్నారు. విధుల్లో పరిస్థితులను అంచనా వేస్తూ ఉన్నతాధికారులకు సమాచారం అందించాలన్నారు. ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనపై వచ్చే ఫిర్యాదులను పరిష్కారానికి జిల్లాస్థాయి నోడల్ అధికారులను సంప్రదించాలన్నారు. ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటును వినియోగించుకునేలా గ్రామాల్లో సదస్సులు నిర్వహించాలని సూచించారు. మద్యం, డబ్బు అక్రమ పంపిణీపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అంతకుముందు ఎన్నికల ప్రవర్తన నియామావళి, విధులు, ఏర్పాట్లు తదితర విషయాలపై జిల్లా స్థాయి ట్రైనర్ కృష్ణ అధికారులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీఎండబ్ల్యూవో దేవుజా, ఆర్డీవోలు రవీందర్ రెడ్డి, వెంకటేశ్వర్లు, రాజు, పాండు, ఎంసీసీ, తహసీల్దార్లు, ఎంపీడీవోలు వివిధ బృందాల అధికారులు, పరిశీలకులు పాల్గొన్నారు.

శ్రీశైలానికి శివస్వాములు

మనూరు, ఫిబ్రవరి 22: మండల పరిధిలోని పలుగ్రామాల నుంచి శివ స్వాములు గురువారం పాదయాత్ర ప్రారంభించారు. కర్నూల్ జిల్లా శ్రీశైలం మల్లికార్జున స్వామిని దర్శించుకునేందుకు మనూరు, తుమ్నూర్, బాదల్‌గావ్, రాణపూర్, బోరంచ, బెల్లాపూర్ తదితర గ్రామాల శివ స్వాములు పాదయాత్రగా బయలుదేరారు. మహాశివరాత్రితో శివ దీక్షలు ముగుస్తున్న నేపథ్యంలో ప్రతీ సంవత్సరం మాదిరిగానే ఈసారి కూడా సుమారు 300కి.మీ దూరంలోని శ్రీశైలం పుణ్యక్షేత్రానికి పాదయాత్రగా వెళ్తున్నట్లు శివ స్వాములు తెలిపారు. అంతకుముందు ఆలయల్లో ప్రత్యేక పూజలు చేసి ఇరుముడి ఏర్పాటు చేసుకున్నారు. కార్యక్రమంలో అమృత్, అంజుగొండ, రాజు, దత్తురెడ్డి, శేఖర్‌రెడ్డి, జనార్దన్ పాల్గొన్నారు.

సైబర్ వలలో చిక్కిన మహిళలు

అమీన్‌పూర్, ఫిబ్రవరి 22: ఇద్దరు మహిళలు సైబర్ నేరస్తుల వలలో చిక్కి రూ.లక్షలు పోగట్టుకున్నారు. ఈ ఘటన అమీన్‌పూర్‌లో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అమీన్‌పూర్‌కు చెందిన ఓ మహిళ గతేడాది డిసెంబర్ 28న టాస్క్‌ల పేరిట మేసేజ్ రావడంతో వారు పంపినటాస్క్‌లు పూర్తి చేసింది. కొద్దిరోజులు లాభాలు రావడంతో నమ్మి రూ.6,63,380 పెట్టుబడిగా పెట్టింది. తర్వాత డబ్బులు తీరిగి రాకపోయేసరికి అనుమానం వచ్చి పోలీసులను ఆశ్రయించింది. అమీన్‌పూర్‌కు చెందిన మరో మహిళ రూ.15లక్షలు పోగొట్టుకొని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సైబర్ క్రైమ్ కింద కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి చిత్తారమ్మ జాతర

జిన్నారం, ఫిబ్రవరి 22: సోలక్‌పల్లి గ్రామంలో శుక్రవారం నుంచి చిత్తారమ్మ జాతర ప్రారంభం కానుంది. నాలుగు రోజుల పాటు జరుగనున్న ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తయినట్లు నిర్వాహకుడు, మాజీ సర్పంచ్ జంగిలి రాములుయాదవ్ తెలిపారు. శుక్రవారం సత్యనారాయణ వ్రతం, గంగపటం, శనివారం యజ్ఞం, దీపోత్సవవ, భజన కార్యక్రమాలు, ఆదివారం భ్రమరాంబమల్లికార్జునస్వామి కల్యాణోత్సవం, అగ్నిగుండాలు, గొలుసు తెంపుట, బండ్లు, బోనాలు, సోమవారం మల్లన్నకు నాగవెల్లి కార్యక్రమంతో జాతర ముగుస్తుందని చెప్పారు. ఉత్సవాలకు గ్రామస్తులతో పాటు, చుట్టు పక్కల ప్రజలు హాజరుకావాలని కోరారు.

విద్యార్థినులకు పరుపులు పంపిణీ

ఝరాసంగం, ఫిబ్రవరి 22: మండల కేంద్రంలోని మహాత్మా జోతిబాపూలే బాలికల గురుకులంలో గురువారం మలని ఫోమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ సీఎస్ఆర్ నిధుల కింద విద్యార్థులకు పరుపులు పంపిణీ చేసింది. కంపెనీ ఎండీ అవినాష్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థిని లక్ష్యం పెట్టుకొని ఇష్టంతో చదవాలన్నారు. చదువుతోనే సమాజంలో అసమానతలు తొలిగిపోతాయన్నారు. కార్యక్రమంలో మెదక్ మాజీ డీసీసీబీ చైర్మన్, బీజేపీ రాష్ట్ర నాయకుడు జైపాల్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు విశ్వనాథం, ప్రిన్సిపాల్ మాధవి, ఉపాధ్యయులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు పరుపులు పంపిణీ చేస్తున్న కంపెనీ ఎండీ అవినాష్ దగ

కంప్యూటర్లు అందజేసిన జర్మనీ బృందం

రోజ్ ఫౌండేషన్‌కు రూ. 10లక్షల చెక్‌ను అందజేస్తున్న జర్మనీ దేశ ప్రతినిధి డైటర్

పటాన్‌చెరు, ఫిబ్రవరి 22: ముత్తంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు జర్మనీ పీఆర్‌వైఎం ప్రతినిధి బృందం కంప్యూటర్లు, ఒకేషనల్ శిక్షణకు కుట్టుమిషన్లను అందజేశారు. గురువారం పటాన్‌చెరు మండలం ముత్తంగి గ్రామంలో రోజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జర్మని దేశానికి చెందిన పీఆర్‌వైఎం గ్రూప్ సీపీవో డైటర్ వెర్‌హోవెన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్కూల్‌లో చదివే విద్యార్థినులకు కుట్టు మిషన్లను అందజేశారు. 10 కంప్యూటర్లను బహూకరించారు.

ఈ సందర్భంగా డైటర్ వెర్‌హోవెన్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థులకు అండగా నిలిచేందుకు తాము జర్మని నుంచి వచ్చి సాయం అందజేస్తున్నామన్నారు. రోజ్ ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ వైవీ రావు గ్రామీణ పేద విద్యార్థుల సంక్షేమం కోసం చేస్తున్న కృషిని చూసి ఇండియాలో వారు సూచించిన పాఠశాలల్లో కంప్యూటర్లు, కుట్టుమిషన్లను అందజేస్తున్నామన్నారు. విద్యార్థులు కంప్యూటర్‌ను నేర్చుకుని జీవితాల్లో రాణించాలని కోరారు.

విద్యార్థినులు కుట్టు శిక్షణ కేంద్రంలో శిక్షణ పొంది భవిష్యత్తులో ఆర్థికంగాను ఎదగాలని కోరారు. స్కూల్ అభివృద్ధికి అండగా ఉంటామన్నారు. వైవీరావు మాట్లాడుతూ జర్మనీ దేశంనుంచి వచ్చిన డైటర్ ఉదారంగా ఉంటూ స్వచ్ఛందగా సాయం అందజేస్తున్నారని కొనియాడారు. వారు ఆశించిన ఫలితాలు వచ్చేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. మరిన్ని సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామని హామినిచ్చారు. ఈ సందర్భంగా రోజ్ ఫౌండేషన్‌కు రూ. 10లక్షలను డైటర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో రోజ్ ఫౌండేషన్ ప్రతినిధి శేషయ్య, హెచ్ఎం శారద పాల్గొన్నారు.

బొంతపల్లి ఆలయానికి భక్తుల పాదయాత్ర

గుమ్మడిదల : పాదయాత్రగా వచ్చిన హిందూ జాగరణ సమితి, రామభక్తులు

గుమ్మడిదల, ఫిబ్రవరి 22 : జిల్లాలోని సుప్రసిద్ధ శైవక్షేత్రమైన బొంతపల్లి భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయం వరకు అయోద్య రామమందిరం యాదిలో రామభక్తులు పాదయాత్ర చేశారు. గురువారం జిన్నారం నుంచి వీరభద్రస్వామి ఆలయం వరకు శ్రీరాముడి భక్తులు, శివస్వాములు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా హిందూ జాగరణ సమితి అధ్యక్షుడు వడ్ల ఆనంద్‌చారి మాట్లాడుతూ గత నెల 22న అయోద్యలో రామ మందిరంలో బాలరాముడి విగ్రహాన్ని ప్రతిష్ఠించి నెల రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా జిన్నారం నుంచి బొంతపల్లి వీరభద్రస్వామి ఆలయం వారకు పాదయాత్రను నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జాగరణ సమితి జిల్లా కార్యవాహ కుర్మరవి, కార్యకర్తలు వంగేటి ప్రతాప్‌రెడ్డి, రాజిరెడ్డి, అశోక్, పల్నాటి భాస్కర్, శంకరయ్య, బండి మహేందర్, పల్నాటి శ్రీనివాస్, గవిండ్ల రంగారెడ్డి, బుక్క శ్రీకాంత్, మెట్టు అనిల్ పాల్గొన్నారు.

అయోద్య యాదిలో

జిన్నారం, ఫిబ్రవరి 22: అయోద్యలో నిర్మించిన భవ్య రామ మందిరంలో బాల రాముని విగ్రహ ప్రతిష్ఠ జరిగి నెల రోజులు పూర్తయిన సందర్భంగా గురువారం జిన్నారం నుంచి భక్తులు బొంతపల్లి వీరభద్రస్వామి ఆలయానికి పాదయాత్రగా వెళ్లారు. హిందూ ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యం లో అధ్యక్షుడు వడ్ల ఆనంద్ పర్యవేక్షణలో ఈ పాదయాత్ర ప్రారంభమైంది. పార్టీలకు అతీతంగా భక్తులు, శివ స్వాములు కాషాయ జెండాలతో జై శ్రీరామ్ నినాదాలతో ఆరు కిలోమీటర్లు పాదయాత్ర చేశారు.

బొంతపల్లిలో వీరభద్రస్వామిని దర్శించుకొని తిరిగి జిన్నారం చేరుకున్నారు. పాదయాత్రలో రాజిరెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, ప్రతాప్‌రెడ్డి, రామ్మూర్తి, మహేందర్‌గౌడ్, బాలాగౌడ్, శ్రీనివాస్, శ్రీకాంత్, రాజేందర్‌రెడ్డి, నక్క నరేందర్, నరేశ్ ఉన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ

కోహీర్, ఫిబ్రవరి 22: మండలంలోని దిగ్వాల్ పిరామిల్ పరిశ్రమకు ఎదురుగా ఉన్న విశ్వేశ్వరాలయ ఆవరణలో గురువారం తుల్జా భవానీమాత విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. కోలాట, భజనకీర్తనల మధ్య భవానీ మాత విగ్రహాన్ని ప్రధాన విధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. అనంతరం మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్చరణల మధ్య అమ్మవారి విగ్రహాన్ని భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో శంకరయ్యస్వామి, రాచయ్యస్వామి, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

ఊట్లలో దుర్గామాత జాతర

జిన్నారం, ఫిబ్రవరి 22: ఊట్ల గ్రామంలో రెండు రోజులుగా దుర్గామాత జాతర వైభవంగా సాగుతున్నది. వనం నర్సింలు ఆధ్వర్యంలో జరుగుతున్న జాతరలో గురువారం బండ్లు, బోనాల ఊరేగింపు కనుల పండువగా సాగింది. అంతకుముందు హోమం, అమ్మవారి చరిత్ర తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. డోలు చప్పుడు, శివసత్తుల శిగాలతో గ్రామం నుంచి బోనాలను ఊరేగింపుగా ఆలయం వరకు తీసుకెళ్లారు. గ్రామస్తులతో పాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు జాతరకు హాజరై అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు.

మహిళ ఆత్మహత్య

పుల్కల్, ఫిబ్రవరి 22: ఉరి వేసుకొని మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం మండల పరిధిలోని పెద్దారెడ్డిపేటలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దగొల్ల పుష్పలత(36)కు పెద్దరెడ్డిపేట గ్రామానికి చెందిన పండరితో 20 ఏండ్ల క్రితం పెండ్లి జరిగింది. రెండేండ్ల క్రితం భర్త మృతి చెందడంతో మనస్తాపానికి గురైంది. రెండు రోజుల క్రితం తన చిన్నమ్మ ఊరు నేరడిగుంటకు వెళ్లివచ్చింది. రాత్రి వేరే గదిలో పడుకుంటానని అత్తతో చెప్పి దూళానికి చీరతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పుష్పలతకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. తల్లిదండ్రుల మృతితో అనాథలుగా మారారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు.

వృద్ధుడు మృతి

పటాన్‌చెరు, ఫిబ్రవరి 22: గుర్తు తెలియని వృద్ధుడు చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. పటాన్‌చెరు పోలీసులు తెలిపిన కథనం ప్రకారం.. పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ పరిధిలోని హనుమాన్ గుడి పక్కన శ్రీనివాస్ ఆటోమెకానిక్ షాప్ వద్ద ఒక వృద్ధుడిని కొద్ది రోజుల క్రితం ఎవరో వదిలి వెళ్లారు. 60 ఏండ్లకుపైన వయసున్న వృద్ధుడు మతిస్థిమితం లేనట్టుగా ప్రవర్తించాడు. గుర్తించి బీ ల్ కలెక్టర్ నాగభూషణం, కాశీనాథ్ అనే వ్యక్తి సాయంతో 108లో సంగారెడ్డి ప్రభు త్వ దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో గురువారం మృతి చెందాడు. ఈ మేరకు పటాన్‌చెరు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పల్స్ పోలియోను విజయవంతం చేయాలి

కోహీర్, ఫిబ్రవరి 22: మార్చి 4న నిర్వహించే పల్స్ పోలియోను విజయవంతం చేయాలని మండల వైద్యాధికారి డాక్టర్ నవీన్‌కుమార్ కోరారు. గురువారం మండలంలోని దిగ్వాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆయా గ్రామాల అంగన్‌వాడీ టీచర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటా సర్వే నిర్వహించి ఐదేండ్లలోపు వయసున్న పిల్లలకు చుక్కల మందు వేయాలని సూచించారు. పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దామని పిలుపునిచ్చారు.

ఉర్సుకు పీర్ సాహెబ్ దర్గా ముస్తాబు

న్యాల్‌కల్, ఫిబ్రవరి 22: మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే మండలంలోని డప్పూర్ గ్రామ సమీపంలోని ఉర్సె షరీఫ్ పీర్‌గైబ్ సాహెబ్ ఖిబ్లా దర్గా ఉర్సుకు ముస్తాబైంది. 23 శుక్రవారం నుంచి ఉర్సు ప్రారంభం అవుతుంది. ఈ ఉత్సవాలకు మండలం నుంచే కాకుండా సమీపంలోని కర్ణాటక తదితర ప్రాంతాల నుంచి కులమతాలకు అతీతంగా భారీగా భక్తులు తరలిరానున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఉర్సులో భాగంగా మొదటి రోజు సాయంత్రం స్థానిక గ్రామం నుంచి సర్కారి గంధంతో ఊరేగింపు, 24, 25, 26 తేదీల్లో దర